


భాగ్యరేఖ

# ఇగురం

కథ

"బాగున్నావె నాయ్నమ్మా!" పల్కరిచ్చుకుంటొచ్చింది సుజాత.

"అగ్గో... ఎప్పుడొస్తివే?" అడ్గింది లచ్చిమక్క.

"నాల్గైదు రోజులయిందే... ఒచ్చీ..."

"అత్త, మామ, మీ దొర అంత బాగున్రా?"

"ఆ౦... బాగనే ఉన్నారు. తాత బాగున్నడానె?"

"ఆ౦... ఇప్పటికైతె మంచిగనే ఉన్నాడు బిడ్డా... ఆయ్న పని ఆయిన్నే జేసుకుంటుండు. యాల్లకింత దింటుండు ఉంటుండు... పల్కరియ్యి పో బిడ్డా" అనుకుంటనే పెద్దాయ్న కొటీడు దిక్కు నడ్శింది లచ్చిమక్క.

"పన్యావయ్యా! సుజాతొచ్చింది సూడు" పెద్దాయ్న మంచం దెగ్గర చిన్నగ ఒంగి చెప్పింది లచ్చిమక్క.

"నమస్తెనే తాత! బాగున్నావె"

"ఆ౦ బాగున్న బిడ్డ, నువ్వు బాగున్నవా?... బుడ్డోన్ని దీస్కరాలే?"

"అన్ని దీస్కొస్తెనన్నీడ నిల్వనిస్తాడె? అమ్మ తాన్నె ఇడ్శిపెట్టొచ్చిన"

"అట్ల గూసోబిడ్డ కుర్సి మీద" కుర్సి జూపిచ్చి లోపటికి వొయ్యింది లచ్చిమక్క.

"ఓ నాయ్నమ్మా! లోపటికేంటికి వోతున్నవ్? నెనిప్పుడేమి తిన, తాగ, తిని చెయ్యిగడుక్కొని సక్కగ ఈడ్కే ఒచ్చిన" ఎన్కనుంచి జెప్పింది సుజాత. ఈమె జెప్పెలోపట్నే అందు కుంది లచ్చిమక్క... "పెద్దామన్నా నాతాన ఏమున్నయి బిడ్డ రడీగ... చాతగాని పొద్దొచ్చింది ఏం జెయ్యకుంటయిన. ఉట్టి 'చా'వెట్టిన పొయ్యిమీద."

రొండు నిమ్మాలల్ల రొండు కోపులల్ల 'చా' వోస్కొని ఒచ్చింది లచ్చిమక్క. ఓటి పెద్దాయ్నకిచ్చి, ఓటి సుజాతకిచ్చింది.

"నువ్వు దెచ్చుకోలేదేమె?" అడ్గింది సుజాత.

"లే బిడ్డా ఈ మద్దెన చా ఎక్వదాగుతె పడ్తలేదు. పొద్దుగాల ఒక్కసారె దాగుతున్న"

"నాయ్నమ్మా! నిన్నొక్కమాట అడ్గనీకె ఒచ్చిన్నే" మెల్లెగ మొదలుపెట్టింది సుజాత.

"ఏంది బిడ్డా"

"నేను అలాగైదామనుకుంటున్న"

"ఆ౦... ఉండుండి అట్లంటున్నవేమే?"

"ఔనే... నిజంగనే అలాగ సంసారం వెడ్దామనుకుంటున్న"

"ఎందుకు?అంత అవుస్రమేమొచ్చిందిప్పుడు?"

"ఏ... నా కాడ మంచిగన్పిస్తలేదు"

"ఏమన్న కొట్లాటలైనయా?"

"ఆ౦.... నేన్గూడ నోరు దెరిస్తె రోజుకో కొట్లాటైతుండె నేను ఒక్కెవట్టి నోర్మూస్కున్నందుకు ఇప్పటి మటుకైతె ఏకొట్లాటలు గాలేదు."

'మరి?' అన్నట్టు సూశింది లచ్చిమక్క.

"సూడె నాయ్నమ్మ మీరు మమ్ల నెట్ల వెంచిన్రే? పెద్దలకు మర్యాదియ్యాలె, పెద్దోల్లె ఏమన్న దిట్టినా చేశినా మన్సుల వెట్టొద్దు. జెర సూశి సూడనట్టుండాలె అని చెప్పుకుంట వెంచిన్రు నేను గూడ అట్లనే మన్సుల వెట్టుకోని అత్తగారింటికివోతి..."

లచ్చిమక్క మోకాలు సుట్టు చేతులు గట్టుకోని సుజాత దిక్కు సూస్కుంట అనుకున్నది మన్సుల...

"ఔ... పిల్లనైతె లెక్కపొంటి వెరిగింది చాల ఒప్కె మన్శి, పనితనం బాగ జేస్కుంటది గూడ."

ముసలాయ్న చెంపకు చెయ్యివెట్కోని కన్ను గొట్టకుంట శ్రద్దగింటుండు మచ్చట.

"మా మామయ్యతోటి ఏమి బాదలేదే... బిడ్డెలెక్క సూస్తడు. మాయత్తతోటె ఒచ్చింది... పెండ్లయిననాటి సం...ది. ఆమె సంగతే నాకు అర్తమైత లేదు. ఎంత ప్రేమ తోటి మాట్లాడవొయినా గూడ నన్ను ఇం...త దూరంల వెడ్తది. ఒక్కనాడు నవ్వుకుంట మాట్లాడదు. నేనేది జేశినా నచ్చుకోదు. ప్రతి పనికి వొంకలు వెడ్తది. పొద్దుం... దాక ఒకటే... సదువుడు వెడ్తది మాటి మాట్కి మీయమ్మరీతి నేర్పలే... మీ నాయ్న బయంబెట్టలే అన్కుంట అమ్మోల్లను ఎత్తిపోస్తది నన్ను గింతగూడ సైసదు. ముందటుంటె అట్లనే అంటదని రూంలవోయి గూసుంటె "ఏమైన పందికొక్కులల్లెక దింటరు బోగం పాపల్లెక్క వంటరు రూంలల్ల" అని రోష మొచ్చెటట్టు, నాకినవడాల్నని రూంముంగలొచ్చి ఒర్లుతది. పిల్లగాడు పుటింసంది ఇంకా నెత్తి నొప్పెక్వయింది. పిల్లగాని వంక వెట్టుకోని నేను పనిజేస్తలేనంటది. పోని పిల్లగాన్ని తను జూస్తదా...అంటె ఎడ్మచేత వట్టదు. పోరన్ని సూస్కోవాలె అల్లకు చాకిరి జెయ్యాలె ఆమె తిట్లు, సదువులు ఇన్కుంట కుక్కలెక్క వడుండాలె... ఆ యింట్ల తిన్నదిగూడ పెయ్యికి వడ్తలేదు... ఇగ నాతోటి గాదే... నాయ్నమ్మా!" ఏడ్సుడు మొదలువెట్టింది సుజాత.

"అయ్యో! ఏడ్వకు బిడ్డా... అన్నిటికి దైర్యం గుండాలె దేవతల సుంటోల్లకు కష్టాల్దప్పలె. మనమెంత. పతి సమశ్శెకు ఏదన్న సమదానం తప్పకుంటది. ఊకో... మీ దొరేమంటుండు మల్ల? మీరిద్దరైతె మంచిగనే ఉన్నరుగద?"

"ఆ౦ మాకిద్దరికి ఏం బేదాల్లేవు. ఆల్లమ్మ

దిక్కేవి మేంగూడ కిస్సరబస్సర అనుకుంటం. అల్లమ్మ గురించేం జెప్పొద్దంటడు. ఆడోల్లు మీరుమీరు సూస్కోవాలె అంటడు. అమ్మయ్యను ఇడ్సివెట్టొస్తె ఈడ నాకున్నదే నువ్వు, నా బాదేందో నువ్వు కనీసం చెవులతోటి ఇననన్న ఇనకపోతె ఎట్ల? అని నేనంట. పొద్దుందాంక బైటికివొయ్యి అల్సిపొయ్యి ఇంటికొస్తె మీ ఆడోల్ల సోది జెప్పి సుకం లేకుంట జేస్తవు అని విసుక్కుంటడు. ఇంత బత్కుబత్కి ఇంటెన్క సచ్చినట్టు. ఈడ అమ్మనాయ్నల మీద ఇంత లాడుగ వెల్లిపొయ్యి, ఆడ ఆల్ల ముడ్డి మూడుసుట్లు చాకిరి జేస్కుంట, మీదంగ- ఆల్ల చీదరింపులు వడుకుంట, నోట్ల మన్నువోస్కోని, ఈన రాంగనె ఏంగానట్టు ఇగిలిచ్చుకుంట ఉండాలంటె నాతోటేడైతదే... నేనైతె ఇగ ఆడుండ నాయ్నమ్మ! ఇంత సదువు సదివి నా సదువు గూడ సాకలిండ్లల్ల ఏశినట్టయితుంది. ఏదన్న చిన్న పోర్షన్ దీస్కోని ఉంటె, చిన్నదో పెద్దదో ఏదన్న సదువుకు దగ్గరని సూస్కుంట చిన్న పిల్లలకు ఇంత టూషన్ జెప్పుకున్నా నాల్గురాల్లొస్తయ్. పిల్లగాడు పెద్దగైతుంటె ఒక్కని సంపాదన ఏడికి సాల్తది? నాకు పెద్దపెద్ద ఆస్తుల మీద, చీరెలు, సారెలమీద ఆశలేదె నాయ్నమ్మ! కష్టపడనీకె ఎన్కకువోను బస్! మన్సుకు శాంతముండి తిన్న నాల్గు మెత్కులు పెయ్యికి వట్టాలె అంతే" పూసగుచ్చినట్టు జెప్పేశింది. జెరసేపు ఎవరూ సప్పుడు జెయ్యలె.

"నువ్వేమంటవే?" అడ్గింది సుజాత.

"ఏ... నేను పాతకాలందాన్ని బిడ్డా... నేన్జెప్తె మీకేం సమజైతది, మీరేమింటరు?"

"అట్లంటవేమె! నీమాటినని దాన్నైతే ఇంత దూరమొచ్చి నీతోటి ఆలోచనెందుకు జేస్త? నువ్వు అనుబవంతోటి జెప్తవనే నీదెగ్గెర్కొస్తి."

జెర్రాగి... మొదలువెట్టింది లచ్చిమక్క.

"సూడు బిడ్డ... తొందరవడ్తె పనులుగావు. ఏదైన నిదానంగ ఆలోశించి పనితనం జెయ్యాలె. ఆలాగ సంసారమంటె మాటలుగాదు. కర్సులు వెరుగుతై ఇంటికిరాయే ఓ పెద్దకర్సు. అత్తమామల మీదున్నపుడు మనం ఏతులకు వోకుంట బయంతోటి కర్సు వెట్టు కుంటము... తిండికాడగాని, ఇవిట్లకాడగాని అవిట్లకాడగాని. అదే నువ్వు అలాగుంటె ఆ బయముండదు. ఏది తినబుద్దయితె అది గొన్కొచ్చుకుంటిమి, ఏడికి దిర్గబుద్దయితె ఆడ్కి తిర్గితిమి. సీన్మాలోంటె... పార్కులోంటె. ఇగ అలాగనే ఉన్నది గదాని... నీ అమ్మగారోల్లు అల్లుఈల్లు ఒచ్చిపోవుకం ఎక్వనే అయితది. ఆల్లు రావొద్దని ఆల్లకు మర్యాద జెయ్యొద్దు కర్సువెట్టొద్దని నేనన బిడ్డా... ఓమాట జెప్తున్న... అంతే! ఎంతయినా కర్సు కర్సేగద నాయ్న! ఇప్పుడు ఎంతపడనట్టున్నా, రక్తసంబంధమాయె. దూరమైతె ఎట్లా ప్రేమలు వెరుగుతయి మీవోల్లు ఆల్లసుట్టాలు టౌనుకొచ్చినప్పుడల్ల ఒచ్చిరి. నాల్గు దినాలుండిపొయ్యిరి. అట్లింత కర్సు పెరిగె. మీ దొరది ఎంత పెద్ద కొలువని? ఒక్కడు ఎంతకని బరిస్తడు బిడ్డా... మొగోని మీద బరువు వెర్గితె చేత్ల పైసలాడక మల్ల కోపాలు తాపాలు కొట్లాటలు నువ్వు అలాగైె ఏంపాయిద బిడ్డా!

కర్సులమాటట్లుంచు. పెద్దకోడలువు రాంగనె ఇల్లు వలగొట్టిందని నీకు చెడ్డపేరెందుకు కొడ్క! అన్లవోను కొడ్కును దూరం జేశిందని పెద్ద మన్సుల కలకల నీగ్గూడ మంచిదిగాదు. పెండ్లయి రొండేండ్లు గాకపాయె నీ మొగన్కి గూడ నీమీద అప్పుడే గురి గుదుర్తాది నాల్గుదినాలు

సూడు బిడ్డ...
తొందరవడ్తె పనులుగావు.
ఏదైన నిదానంగ ఆలోశించి పనితనం
జెయ్యాలె. ఆలాగ సంసారమంటె మాటలుగాదు. కర్సులు వెరుగుతై ఇంటికిరాయే ఓ పెద్ద
కర్సు. అతమామల మీదున్నపుడు మనం
ఏతులకు వోకుంట బయంతోటి కర్సు
వెట్టుకుంటము... తిండికాడగాని,
ఇవిట్లకాడగాని అవిట్లకాడగాని. అదే
నువ్వు అలాగుంటె ఆ
బయముండదు.

వోంగ మెల్లెమెల్లెగ నీమీద ప్రేమ పెర్గుతుంటది, నీ పరెశాన్ గూడ అయ్నకు అర్తమైతుంటది. అన్లవోను పెండ్లిగాని ఆడివిల్ల ఇంట్లుంటె ఇంటికి పెద్దోల్లె తప్పిచ్చుకోని వొయింరన్ని బద్నామ్ మీకెందుకు? ఎట్లా పిల్లకు సంబందాలు సూస్తనే ఉన్నరుగద, ఒచ్చె యాడాదికల్ల ఆ పిల్ల పెండ్లైతది ఓ బర్వు దీర్తది. బుడ్డోడు ఏట్లు... యాడాది నర్దం ఉండనే ఉన్నడు. ఇంకో యాడాదినర్థం ఓపిన వోంటె అన్ని ఇస్కుల్ల ఎయ్యాలె అని టౌనుకు రావొచ్చు. పెద్ద మన్సులు గూడ యదార్త పడ్తరు. జెర రొండేన్లు ఓపికవట్టాలె బిడ్డా. మరీ అంత కష్టమేమున్నది ఆడ... నీకు. ఔవమ్మ మొగడు తాగొచ్చి గొడ్తున్నడు తిండికి కష్టమున్నది అన్నట్టుగాకపాయె. ఉన్నదంత మీ యత్తతోనే గద! జెర్ర ఓపుకోవాలె బిడ్డ! చిన్నదానవు. నీ తప్పు లేకుంట ఆమె నిన్ను ఏందిట్టినా, ఎంత సాపెన్లు వెట్టినా అది నీకు దల్గదు. మీదంగ అది నీకు దీవెననే ఐతది. నిన్నుగాదు ఆ గోడను దిడ్తున్నదని అనుకోని బరించాలె.

లేస్త కూసుంట ఆ నారాయ్నమూర్తి! ఆ పరమాత్మను తల్సుకోవాలె! ఆయిన్నె అన్నిట్ని ఓపుకోనీకె మనకు సత్తువ ఇస్తడు బిడ్డ. నాయమ్మ దొర్సానివి తొందరపడకు. జెరవోపితె నీకన్ని మంచిగయితయి బిడ్డ!"....

లచ్చిమక్క నోట్లెనుంచి అనుబవం ఏరైపారింది. పిల్ల మన్సులపరెశాన్ అంత అన్లవడి కొట్కపోయినట్టుంది. సరే అన్నట్టు సుజాత నెత్తూపింది.

